క్లుప్తంగా

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ సర్వీసులు



అరుణాచలానికి బస్సు సర్వీసును పంపిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: భక్తుల కోరిక మేరకు కదిరి డిపో నుంచి శైవక్షేత్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని డీఎం మైనోద్దీన్ తెలిపారు. గురువారం ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి రెండు బస్సు సర్వీసులు పంపించినట్లు వెల్లడించారు.

సొమ్ము రికవరీకి ఆదేశం

ఎన్పీకుంట: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఎంపీపీ ఈటె రాము అధ్యక్షతన సామాజిక తనిఖీ, బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం ఇచ్చిన నివేదికలను డ్వామా పీడీ విజయకుమార్, అధికారులు పరిశీలించారు. ఉపాధి హామీలో రూ.81,260, పంచాయతీరాజ్ పనుల్లో రూ.1,58,001 సొమ్ము రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజినమ్మ, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, ఏపీడీ రమేష్‌బాబు, ఎంపీడీఓ ఆంజినప్ప, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బేల్దారికి గాయాలు

కదిరి అర్బన్: తుమ్మల రోడ్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బడవాండ్లపల్లికి చెందిన నాగభూషణం అనే బేల్దారికి గాయాలయ్యాయి. కదిరిలో పని ముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

అభివృద్ధి పనులకు ప్రణాళిక

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం ఎంపీడీఓ నరసింహనాయుడు, పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, అశోక్‌కుమార్ కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రోత్సాహక బహుమతులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని బాలికల ఉన్నతపాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గత సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ మార్కులతో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డు ఉపాధ్యాయురాలు మారుతి ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మారుతిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలను నిర్వహించడం జరుగుతోందని తహసీల్దార్ సురేష్ కుమార్ రైతులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభ నిర్వహించారు.


మానవత్వం చాటుకున్న ఎస్ఐ



వృద్ధురాలిని జీపులోకి ఎక్కిస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: మతిస్థిమితం లేని వృద్ధురాలిని పోలీసులు చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. కొన్ని రోజులుగా ఓ మతిస్థిమితం లేని వృద్ధురాలు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం వద్దనే ఉండేది. ఎవరైనా ఇస్తే తింటూ లేకపోతే అలాగే ఉండేది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ గురువారం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. వివరాల కోసం ఆరా తీయగా.. ఆమెకు మతిస్థిమితం లేదని నిర్ధారించారు. కుమార్తె సుబ్బరాయనిపల్లిలో ఉందని పోలీసులకు తెలిపింది. వెంటనే స్పందించిన ఎస్ఐ.. ఆమెను కారులో తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వృద్ధురాలిని జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు.

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: టింబక్టు కలెక్టివ్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తోందని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ కార్యాలయం ఆవరణలో గురువారం 35వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా జన జాగృతి సంస్థ ప్రతినిధి బలరాం, రెడ్స్ ప్రతినిధి భానుజా, రైడ్స్ ప్రతినిధి కిష్టప్ప హాజరై, మాట్లాడారు. టింబక్టు సంస్థ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, పిల్లలు, యువత, చిన్న, సన్నకారు రైతులు, కూలీలు, వికలాంగులు, కళాకారులు తదితర వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బబ్లూ గంగూలీ, సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య శాకమూరి, వివిధ మండలాల మహిళలు పాల్గొన్నారు.

సంక్షోభ వసతి గృహాలు

- సౌకర్యాల కల్పనలో విఫలం
- భోజనంలో నాణ్యత కరువు
- తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య



తాడిమర్రిలో మూతపడిన ఎస్సీ హాస్టల్



తాడిమర్రి బీసీ హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లు

తాడిమర్రి: సంక్షేమ వసతిగృహాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రిలో ఎస్సీ, బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ హాస్టల్ 2022 సంవత్సరంలో 120, 2023లో 80 మంది ఉన్న విద్యార్థులు ఈ ఏడాది 10 మందికే పరిమితం అయ్యారు. ఆ పది మందిని కూడా అధికారులు ఇళ్లకు పంపించేసి హాస్టల్ మూసేశారు. వార్డెన్ లాంగ్‌లీవ్‌పై వెళ్లారు. బీసీ హాస్టల్‌లో 2022లో 110 మంది విద్యార్థులు ఉండగా 2023లో 70, ఈ ఏడాది 16కు విద్యార్థుల సంఖ్య పడిపోయింది. అలాగే ముదిగుబ్బ మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో గత 2022లో 180, 2023లో 165, 2024లో 140 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ముదిగుబ్బ మండలం ఎనుములవారిపల్లిలోని బీసీ బాలుర వసతి గృహంలో 2022లో 165, 2023లో 128, ఈ ఏడాది 110 మందికి విద్యార్థుల సంఖ్య పరిమితమైంది. ధర్మవరం పట్టణంలో ఎస్సీ బాలికల వసతి గృహంలో 2022లో 125, 2023లో 102, ఈ ఏడాది 87 మంది విద్యార్థినులు మాత్రమే ఉంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రభుత్వ ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే సంక్షేమ వసతి గృహాల అధ్వానస్థితికి కారణం. హాస్టళ్లపై పర్యవేక్షణ లోపించడం, వార్డెన్లు సరిగా విధులు నిర్వహించకపోవడంతో విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వెళ్లడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పూర్తిగా పడిపోయింది. దీంతో గ్రామీణ ప్రాంతాల వారు తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పించడానికి వెనుకంజ వేస్తున్నారు. ఫలితంగా హాస్టళ్లల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

అరకొర సౌకర్యాలతో అవస్థలు

సంక్షేమ వసతి గృహాల్లో వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో మరుగుదొడ్లు లేవు. కొన్నిచోట్ల ఉన్నప్పటికీ నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. డార్మెటరీలు, బాత్‌రూములు, చివరకు తాగునీరు కూడా అందుబాటులో ఉండడం లేదు. ఇక్కడి పరిస్థితులు తెలుసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను సంక్షేమ వసతి గృహాల్లో చేర్పించలేకపోతున్నారు. భోజనం కూడా నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు ఇక్కడ ఉండేందుకు విముఖత చూపుతున్నారు.

పేద విద్యార్థులకు తీవ్ర నష్టం



ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు మూతపడటం పేద విద్యార్థులకు తీవ్ర నష్టం. గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు లేకపోవడం, ఇళ్ల వద్ద విద్యార్థులకు తగ్గట్టు వసతి, సౌకర్యాలు లేకపోవడంతో పిల్లలను హాస్టళ్లలో చేర్పిస్తున్నారు. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి.

– సాకే వినోద్, పిన్నదరి, తాడిమర్రి

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ వసతి గృహాలు మూత పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, వసతి కల్పిస్తాం. వ్యక్తిగత మరుగుదొడ్లు, బాత్ రూములను మరమ్మతు చేయిస్తాం. నాణ్యమైన భోజనం అందిస్తాం. విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు అవసరమైన వాతావరణం కల్పిస్తాం.

–వెంకటేశ్వర్లు, ఏఎస్‌డబ్ల్యూఓ, ధర్మవరం

నేటి బాలలే రేపటి పౌరులు



ఓడీచెరువులో వివిధ వేషధారణల్లో చిన్నారులు



పుట్టపర్తి సాయివిద్యానికేతన్‌లో బాలల దినోత్సవం

పుట్టపర్తి రూరల్: నేటి బాలలే రేపటి పౌరులని వక్తలు పేర్కొన్నారు. పుట్టపర్తిలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. సాయివిద్యానికేతన్ స్కూల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఓడీచెరువు : మండల కేంద్రం ఓడీచెరువులోని విజ్ఞాన్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మారగానికుంట్ల ఫక్రుద్దీన్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో చిన్నారులు పాల్గొన్న ఫ్యాషన్ పరేడ్ ఆకట్టుకుంది. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బహుమతుల ప్రదానం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని సిబ్బంది, పూర్వ విద్యార్థులు నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు కేశవయ్య, రక్షిత, వర్షిణిలకు పూర్వ విద్యార్థులు రవీందర్‌రెడ్డి బయారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేల నగదు బహుమతి అందించారు.

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. లయోలా పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు, సభ్యులు పల్లెం వేణుగోపాల్, కార్యదర్శి రమేష్, కోశాధికారి నాగేంద్రలు పాఠశాలకు విచ్చేసిన ఎంపీడీఓ సాయిమనోహర్‌ను సత్కరించారు. జీవానంద పాఠశాల వేడుకల్లో విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ మునెయ్య హాజరయ్యారు.

తాడిమర్రి: తాడిమర్రిలోని కేజీబీవీలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి డీ.శీనా, ప్రిన్సిపాల్ వాణిశ్రీ, అధ్యాపకులు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటు



మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న మద్యం షాపు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మద్యం దుకాణాల విషయంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తోన్న ధర్మవరంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అండతో నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ధర్మవరం నుంచి మామిళ్లపల్లికి వెళ్లే దారిలో మద్యం దుకాణం నంబరు 12కు ధర్మవరం రూరల్‌లో అనుమతులు వచ్చాయి. అయితే వ్యాపారం బాగుండాలనే ఉద్దేశంలో నిబంధనలు ఉల్లంఘించి అర్బన్ పరిధిలో నిర్వహిస్తున్నారు. దుకాణం ఉన్న ప్రాంతం పట్టణ పరిధిలోకి వస్తుందా? గ్రామీణ పరిధిలోకి వస్తుందా? ఎలా నిర్వహిస్తారనే విషయం మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. అయితే కూటమి నేతల భయంతో ఎవరూ ముందుకు రావడం లేదు.

ఎక్సైజ్ అధికారులు ఏమంటున్నారంటే..

'అనుమతులు పొందిన ప్రాంతాల్లోనే మద్యం దుకాణాలు నిర్వహించాలి. షాపు నంబరు 12 ధర్మవరం రూరల్‌లోనే ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి డోర్ నంబరు లేకుండా దుకాణం నిర్వహిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. దుకాణం ఏ పరిధిలోకి వస్తుందో మున్సిపల్ అధికారులు నిర్ధారణ చేయాల్సి ఉంది. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే దుకాణం రద్దు చేస్తాం'.

నిర్మాణ పనులు ఆపండి

ఓడీచెరువు: ఎం.బి.క్రాస్‌లోని కుర్లి ఉత్తమరెడ్డి కుమారులైన నరసిరెడ్డి, రంగారెడ్డి, జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డిల ఇంటికి ఆనుకొని ఉత్తరం వైపు స్థలం విషయమై అదే గ్రామానికి చెందిన భీమిశెట్టి రామచంద్ర, అతని కుమారులకు మధ్య వివాదం కొనసాగుతోంది. అయితే సదరు స్థలం విషయమై కదిరి అడిషనల్ సివిల్ కోర్టులో కేసు నడుస్తోంది. సదరు స్థలం కోర్టు పరిధిలో ఉండగానే రామచంద్ర కుమారులు దౌర్జన్యంగా ఇల్లు కట్టడానికి పునాది తీస్తున్నారు. తక్షణమే నిర్మాణ పనులు ఆపాలని కోరుతూ ఓడీచెరువు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి తెలిపారు. వారిపై చర్యలు చేపట్టని పక్షంలో తామే పనులు అడ్డుకుంటామని, ఆ సమయంలో తమకు రక్షణ కల్పించాలని అందులో కోరారు.

'అపార్' త్వరగా పూర్తి చేయాలి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసూన్‌కుమార్ నాయుడు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. అనంతరం అపార్ నమోదుపై ఆరా తీశారు.

ఆదర్శప్రాయుడు చెన్నకృష్ణారెడ్డి



చెన్నకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం కేశాపురం ఉన్నత పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి ఆదర్శప్రాయుడని వక్తలు పేర్కొన్నారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చెన్నకృష్ణారెడ్డిని బుక్కపట్నం మండలం సిద్దరాంపురం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులతో పాటు సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం శ్రీకాంత్, పూర్వ విద్యార్థులలో ఒకరైన అనంతపురం రాఘవేంద్ర ఫార్మసీ కాలేజ్ కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ చెన్నకృష్ణారెడ్డి ఏ పాఠశాలలో పని చేస్తే ఆ పాఠశాలను దేవాలయంగా భావించి గ్రామస్తులు, సత్యసాయి భక్తుల సహకారాలతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని కొనియాడారు.

కొక్కంటిలో గ్రామసభ

తనకల్లు: కొక్కంటిలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ నిర్వహించినట్లు భూ సర్వే ఆర్ఐ మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నరేష్, కార్యదర్శి బాబ్జాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు గుర్తించండి

బత్తలపల్లి: ఉపాధిహామీ పథకం కింద గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులను గుర్తించాలని ఎంపీడీఓ నరసింహనాయుడు, ఏపీడీ వెంకటాచలపతి సూచించారు. గురువారం పోట్లమర్రి పంచాయతీలో సర్పంచ్ అక్కిం దామోదర్ అధ్యక్షతన 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపు కోసం గ్రామసభ నిర్వహించారు.

సమస్యలుంటే అర్జీ ఇవ్వండి

అమడగూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రత్యేక 'స్పందన' నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామనాథరెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే గురువారం ఈడిగవారిపల్లిలో 'స్పందన' నిర్వహించగా పలువురు రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు.

పీహెచ్‌సీ తనిఖీ

గాండ్లపెంట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ బాబురావు తనిఖీ చేశారు. వైద్యాధికారి బాబాఫక్రుద్దీన్‌తో సిబ్బంది వివరాలు, మందుల నిల్వ, ఓపీ, వ్యాక్సినేషన్ తదితర అంశాలపై ఆరా తీశారు.

అధ్యాపకునికి ఘన సన్మానం

పుట్టపర్తి: ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ అధ్యాపకుడు రాజ్ మహమ్మద్‌కు గురువారం ప్రిన్సిపాల్ మక్బుల్ హుస్సేన్, సిబ్బంది ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తి టౌన్: వీరజిన్నాయపల్లిలో గురువారం ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి ఓ వ్యక్తిని అరెస్టు చేసి, పది కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ నాగరాజు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బాలకార్మిక రహిత సమాజమే ధ్యేయం

ధర్మవరం అర్బన్: బాల కార్మిక రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని అనంతపురం జిల్లా ఉప కార్మిక కమిషనర్ లక్ష్మీనరసయ్య, ధర్మవరం అసిస్టెంట్ కమిషనర్ సూర్యనారాయణ, ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి, సహాయ కార్మిక అధికారి నరేష్‌కుమార్ కోరారు. పట్టణంలో గురువారం బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం రాత్రి వారు తమ సిబ్బందితో కలిసి సుబ్బరావుపేటలో గ్రామ సభ నిర్వహించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం

గాండ్లపెంట: మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పర్సన్ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌నాయక్ గురువారం ప్రారంభించారు. సిబ్బందితో కలిసి సహకార జెండా ఆవిష్కరించి, గీతాన్ని ఆలపించారు.

డిమాండ్లు నెరవేర్చండి

ముదిగుబ్బ: పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని ముదిగుబ్బలోని పంచాయతీ కార్మికులు కోరారు. గురువారం సీఐటీయూ నాయకులతో కలిసి వారు ఎంపీడీఓ విజయ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

నాటుసారా ఊటల ధ్వంసం

కదిరి అర్బన్: కె.బత్తలపల్లి తండా సమీపంలో గురువారం ఎక్సైజ్ పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. వేర్వేరు చోట్ల మొత్తం 1120 లీటర్ల నాటుసారా ఊటలను ధ్వంసం చేశారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపారు.

సరైన చికిత్సతో వ్యాధులు నయం

ధర్మవరం రూరల్: పోతుకుంట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో జరుగుతున్న ఎన్‌సీడీ 3.0 కార్యక్రమాన్ని గురువారం జిల్లా లెప్రసీ, క్షయ నివారణ అధికారి డాక్టర్ జి.తిప్పయ్య పరిశీలించారు. ఏ వ్యాధి అయినా తొలి దశలోనే గుర్తిస్తే సరైన చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చని ప్రజలకు తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ధర్మవరం రూరల్: అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కుణుతూరు వద్ద ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌ను ఆయన పరిశీలించారు.

వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలి

ఎన్పీకుంట: కేజీబీవీల్లో వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తనకల్లు: ముత్యాలవారిపల్లి వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గోపి గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,060 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

బత్తలపల్లి: మహిళలపై దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం బత్తలపల్లిలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్‌తో కలిసి మండలంలోని మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు.

బాలల హక్కులను గౌరవిద్దాం



ధర్మవరంలో చిన్నారికి కేక్ తినిపిస్తున్న దృశ్యం



ధర్మవరంలో మెడల్స్ అందుకున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: బాలల హక్కులను పరిరక్షించడంతో పాటు వాటిని గౌరవించాలని ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం బీడుపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటరమణ అధ్యక్షతన జరిగిన జాతీయ బాలల దినోత్సవంలో ఆర్డీఓతో పాటు డీఈఓ కిష్టప్ప, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి మాట్లాడారు. 'ఆన్‌లైన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్ అందించారు. కార్యక్రమంలో డీసీపీఓ మహేష్, సీఐ ఇందిర, డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓలు ప్రసాద్, ఖాదర్‌వలి, ప్రొటెక్షన్ ఆఫీసర్లు నాగలక్ష్మి, మురళీధర్, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

తనకల్లు: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లోనూ చిల్డ్రన్స్ డే ఘనంగా చేశారు.

ధర్మవరం: నాగలూరు వద్దనున్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్ రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. పట్టణంలోని ఉషోదయ పాఠశాలలో కరస్పాండెంట్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు.

గ్రంథాలయాలతో మేధాశక్తి మెరుగు



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రంథాలయ అధికారులు, విద్యార్థులు

ధర్మవరం అర్బన్: గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతోనే మేధాశక్తి మెరుగుపడుతుందని గ్రంథాలయాధికారి అంజలి సౌభాగ్యవతి తెలిపారు. పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు.

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఆ శాఖ అధికారులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బొజ్జే నాయక్ పాల్గొన్నారు.

గాండ్లపెంట: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సర్పంచ్ రహంతుల్లా సూచించారు. గాండ్లపెంటలోని శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. గ్రంథాయాధికారి ఫరియాబాను, తెలుగు ఉపాధ్యాయుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మున్సిపల్ కార్యాలయం ముందున్న శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. స్వాతంత్య్రోద్యమంలో గ్రంథాలయాల పాత్రను పాఠకులకు లైబ్రేరియన్ క్రిష్ణ కిషోర్‌రెడ్డి తెలియజేశారు.

బత్తలపల్లి: బత్తలపల్లి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు, మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల, శ్రీజ్యోతి హైస్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు.

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ చెన్నకేశవులు, పంచాయతీ సర్పంచ్ రామాంజనేయులు, కార్యదర్శి మురళీక్రిష్ణ, యునాని డాక్టర్ అబ్దుల్ రఫీ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రామగిరి: రామగిరిలోని గ్రంథాలయంలో జరిగిన వేడుకల్లో ఎంఈఓ శ్రీనివాసులు, గ్రంథాలయ అధికారి వెంకటేష్, కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యలత పాల్గొన్నారు.

కనగానపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకత, పుస్తక పఠనంపై ఎంఈఓ అరుణమ్మ వివరించారు. కార్యక్రమంలో మండల గ్రంథాలయాధికారి గోవిందు, ప్రధానోపాధ్యాయులు అబ్బాస్, మంజునాథ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

తనకల్లు: ప్రాణాంతకర క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా నోడల్ ఆఫీసర్ వీరమ్మ సూచించారు. తనకల్లు మండలం తవళం, బాలసముద్రం గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.0 క్యాన్సర్ సర్వేని గురువారం ఆమె పరిశీలించారు. 18 ఏళ్లు పైబడిన వారందరికీ క్యాన్సర్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొక్కంటి వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, హెల్త్ అసిస్టెంట్లు సూర్యనారాయణరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ మంజుల, హెల్త్ అసిస్టెంట్లు మోహన్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించడం కోసమే ప్రభుత్వం ఎన్‌సీడీ సర్వే ప్రవేశ పెట్టిందని మండల వైద్యాధికారి డాక్టర్ ఆసియా తెలిపారు. దిగువతూపల్లి గ్రామంలో గురువారం ఎన్‌సీడీ ఇంటింటి సర్వే నిర్వహించారు.

క్యాన్సర్‌పై ఇంటింటి సర్వే చేపట్టాలి

చెన్నేకొత్తపల్లి: వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డాక్టర్లు నివేదిత, రవినాయక్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంతో పాటు సర్వే ప్రారంభించారు.

కనగానపల్లి: ప్రాణాంతకంగా మారిన క్యాన్సర్ వ్యాధిని ముందు జాగ్రత్తగా నివారించుకుందామని పీహెచ్‌సీ డాక్టర్ భానురేఖ తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది కాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని బురుజు సర్కిల్, ఎల్లమ్మ వీధిల్లో గురువారం వైద్యాధికారులు దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమాన్ని డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, మండల వైధాధికారి కల్పనారెడ్డి పర్యవేక్షించారు.

పుట్టపర్తి అర్బన్: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలో ఇంటింటి సర్వే ప్రారంభించారు. సీహెచ్ఓ నగేష్ ఆధ్వర్యంలో బత్తలపల్లి, కొట్లపల్లి, పెడపల్లి గ్రామాల్లో సర్వే చేశారు. ఆహారపు అలవాట్లు, జబ్బులపై స్క్రీనింగ్ చేసి వివరాలు నమోదు చేశారు.

కార్తీక పౌర్ణమికి ఆలయాలు సిద్ధం

బత్తలపల్లి: కార్తీక పౌర్ణమి వేడుకలకు ధర్మవరం నియోజకవర్గంలోని పుణ్య క్షేత్రాలు, ముఖ్య ఆలయాలు, అన్ని గ్రామాల్లోని ఆలయాలు సిద్ధమయ్యాయి. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో ఆలయ నిర్వాహకులు దీపోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. హిందువులు కార్తీక మాసాన్ని పవిత్రంగా భావిస్తారు. ఇక దీపారాధనకు ప్రాధాన్యం ఉంది. దీని వల్ల శుభఫలితాలు కలుగుతాయని, ఆరోగ్యంగా ఉంటామని ప్రజల నమ్మకం. ఈ నెలలో దీపాన్ని దైవ స్వరూపంగా భావిస్తారు. పౌర్ణమి సందర్భంగా నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల మధ్య దీపాలను వెలిగించాలి.